జె.సి.శోబిక సేవలు చిరస్మరణీయం : కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జాయింట్ కలెక్టర్‌గా ఎస్ ఎస్ శోబిక సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబికకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులు, రెవిన్యూ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు, ధాన్యం సేకరణ, యోగాంధ్ర, పి.జి.ఆర్.ఎస్, రీసర్వే, రెవిన్యూ వ్యవహారాలలో మంచి పనితీరు కనబరిచారన్నారు. ప్రతీ పనిలో ఎంతో ప్రణాళికతో, పక్కాగా నిర్వహిస్తారని ఆయన చెప్పారు. చిన్నా, పెద్ద కార్యక్రమాలను కూడా ఒకే రీతిలో చేస్తారని ఆయన తెలిపారు. పనిలో దిట్ట అన్నారు. పనిని జీవితంగా భావిస్తారని ఆయన పేర్కొన్నారు. సమీక్షల నిర్వహణలో ఎంతో పరిణతి కనిపిస్తుందని ఆయన అన్నారు. జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు. పోలీస్ సూపరింటెండెంట్ ఎస్ వి మాధవ రెడ్డి మాట్లాడుతూ పరిపాలనలో మంచి సహాయ సహకారాలు అందించారన్నారు. విధులపట్ల అంకిత భావంతో పనిచేశారని ఆయన పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. అనేక కొత్త అనుభవాలు, అనుభూతులను జిల్లా అందించిందని అన్నారు. జిల్లా కలెక్టర్‌లు మంచి సహాయ సహకారాలు అందించారన్నారు. ఎన్నికల నిర్వహణలో రెవిన్యూ అధికారులు, సిబ్బంది ఒక బృందంగా పనిచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె హేమలత, పార్వతీపురం సబ్ కలెక్టర్ డా.ఆర్ వైశాలి, పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డిప్యూటీ కలెక్టర్‌లు పి ధర్మచంద్రారెడ్డి, ఎస్ దిలీప్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ భాస్కర రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం సుధారాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి పి లక్ష్మణ రావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా.టి కనకదుర్గ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి వై నాగేశ్వర రావు, రెవిన్యూ అధికారులు, ఎం.పి.డి.ఓ లు, డీలర్స్ సంఘం, మిల్లర్ ల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై రైతులతో పోరాటానికి సిద్ధం కండి

విశాలాంధ్ర-కురుపాం : యూరియా కొరతపై పోరాటం చేసేందుకు రైతులతో కలిసి సిద్ధం కావాలని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి పిలుపు ఇచ్చారు. ఆదివారం యూరియా కొరతపై పోరాటానికి సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత, ఇష్టారాజ్యంగా బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు జరుపుతూ రైతులకు రోడ్డెక్కించిన ఘనత కూటమి ప్రభుత్వాది. రైతు సేవా కేంద్రాలు, సొసైటీలలో అధికారపార్టీ నాయకుల హవా కొనసాగించిన నేపథ్యంలో ఈనెల 9న నియోజకవర్గంలోని పార్వతీపురం, పాలకొండ ఆర్.డి.ఓ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపడతామని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల రైతులు, కార్యకర్తలు పాలకొండ ఆర్డీవో కార్యాలయం గరుగుబిల్లి, కొమరాడ మండలాలకు చెందిన రైతులు, కార్యకర్తలు పార్వతీపురం ఆర్డీవో కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలకు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

మహిళల ఆర్థిక సాధికారతకు స్త్రీశక్తి పథకం దోహదపడుతుంది

రాష్ట్ర శిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు : రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారతకు స్త్రీశక్తి పథకం దోహద పడుతుందని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.స్త్రీ శక్తి పథకం అమలుతో విజయోత్సవ సభను నియోజకవర్గ మహిళలతో కలిసి పట్టణంలో వేణుగోపాల స్వామి గుడి ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ముందుగా తన క్యాంప్ కార్యాలయం నుండి వేణుగోపాల స్వామి గుడి వరకు నియోజకవర్గం నలమూలల నుండి కదిలివచ్చిన మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం వేలాదిమంది మహిళలకు మేలు చేస్తుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వలన రాష్ట్రంలో మహిళలు సంతోషంగా ఉన్నారన్నారు.పై పథకం ద్వారా మహిళలకు ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి కలుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 11449 బృందాలు ఏర్పడి,8458 బృందాలు విజయవంతంగా కార్యకలాపాలు చేపడుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 162 కోట్ల ఋణాలు, 1942 కోట్ల సహకార నిధులు అందించబడ్డాయన్నారు. ప్రతీ బృందానికి 100% సబ్సిడీతో ఋణ సౌకర్యం కల్పిస్తూ, మహిళలు స్వయం ఉపాధి లో ముందడుగు వేయడానికి అవకాశం కల్పించబడిందన్నారు. ఈ పథకం కింద ఇప్పటికే 25 లక్షల మంది మహిళలు లబ్ధి పొందారన్నారు. స్త్రీశక్తి పథకం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, మహిళల ఆత్మగౌరవానికి, ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి కలెక్టర్ సన్మానం

విశాలాంధ్ర-బెలగాం : గురుపుజోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీన విజయవాడలో జరిగిన ఉత్తమ అధ్యాపక ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మానవ వనరుల అభివృద్ధి & విద్యా శాఖా మాత్యులు నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న తెర్లి రవికుమార్ (ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గుమ్మలక్ష్మీపురం)ను ఆదివారం కలెక్టరేట్‌లో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ ఎ.శ్యామ్ ప్రసాద్ సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వై.నాగేశ్వరరావు, సర్వ శిక్ష అభియాన్ ఎపిసి రెడ్డి తేజేశ్వరరావు, అధ్యాపకులు టి. మల్లికార్జునరావు, మరిపి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు విఓఏలకు 3 సంవత్సరాల కాలపరిమితి సర్కిల్ రద్దు చేయాలి

- ఉద్యోగ భద్రత కల్పించాలి - హెచ్ఆర్ పాలసీ ప్రకటించాలి
- జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి పిలుపు

విశాలాంధ్ర-బెలగాం : స్థానిక సుందరయ్య భవనంలో విఓఎల జిల్లా మహాసభను కె. కుమారి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలో విఓఏల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మి మాట్లాడుతూ విఓఏల 3సం. కాల పరిమితి సర్కిల్ రద్దు చేయాలని కోరారు. మెప్మాలో ఈ సర్క్యులర్ ను రద్దు చేశారని అదే రకంగా వెలుగు సెల్ఫ్‌లో కూడా సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి పనిచేస్తున్న వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, రకరకాల పనులు ఇవ్వడం ద్వారా ఐకెపి విఓఏల పని భారం పెరుగుతుందని, పార్వతీపురం జిల్లాలో పలు యాప్ల లాగిన్ చేయడం ద్వారా విఓఏలు అనారోగ్యం పాలవుతున్నారని రాజకీయంగా వేధిస్తూ ఈ జిల్లాలో 19 మంది విఓఏలను తొలగించడం అన్యాయమన్నారు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెరగడం లేదని విమర్శించారు. ఇస్తున్న వేతనాలు ఆరు, మూడు నెలలకు ఒకసారి చెల్లించడం దారుణమైన విషయమని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలగింపులు, వేధింపుల నుండి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విఓఏల జీతం నాలుగైదు వేలు ప్రభుత్వం నిర్వహించే సమావేశాలకు సరిపోతుందని అనేక కారణాలతో ప్రభుత్వ విధానాలతో బ్యాంకర్ ఉన్నాడా రికవరీ కాకపోతే విఓఏల జీతంలో రికవరీ అన్యాయమని తెలిపారు. విఓఎల సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా విఓఎలు అందరూ ఐక్యమై ఉద్యమించాలని కోరారు. అనంతరం జిల్లాలో 15 మండలాల నుండి హాజరైన విఓఏలు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా కె. ధర్మరాజు, కోశాధికారి కె. కుమారి. సహ కార్యదర్శిగా సుందర్‌రావు, దేవి. ఉపాధ్యక్షులుగా డి.అరుణ, విజయ్‌కుమార్‌లను ఏడుగురు జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విఓఏ జిల్లా బాధ్యులు సిఐటియు నాయకులు వి. రామలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. మన్మధరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిరా మాట్లాడారు. జిల్లాలో విఓఏలు ఎదుర్కొన్న సమస్యలపై అనేక ఉద్యమాలు పోరాటాలు జరిగాయని తెలియజేస్తూ రాబోయే కాలంలో విఓఏలు హెచ్ఆర్ పాలసీ అమలుకై, జీవో రద్దుకు ఉద్యోగ భద్రతపై ఉద్యమించాలని కోరారు.

పలువురు ఉత్తమ ఉపాధ్యాయులకు బొబ్బిలి ఎమ్మెల్యే సత్కారం

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని పలు పాఠశాలల నుండి రెండు జిల్లాల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని బొబ్బిలి ఎమ్మెల్యే బాబునాయన దుశ్శాలువాలు కప్పి, పూలబోకేలు అందజేసి సత్కరించారు. సత్కరించిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా పిఆర్టియు అధ్యక్షులు ఓలేటి తవిటినాయుడు, విజయనగరం జిల్లా ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘంనేత కురమాన జోగారావు, ఏపీటీఎఫ్ నాయకులు చుక్క శ్రీదేవి, చప్ప ఈశ్వరరావు తదితరులు ఉన్నారు. కురమాన జోగారావు కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల చినబోగిలి సర్పంచ్ కురమాన శ్రీనివాసరావు, చినభోగిలి నాయకులు గ్రామస్తులు అభినందన తెలిపారు.

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులను పొందిన డాక్టర్ కొయ్యాన శ్రీరాములు (మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్), దేవతల రామారావు (సోషల్ స్కూల్ అసిస్టెంట్)లను బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఇజ్జా ప్రసన్న లక్ష్మి, స్కూల్ అసిస్టెంట్ గేదెల నాగరాజులు పాల్గొన్నారు.ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులను పొందిన వారిద్దరిని హెచ్ఎం తోపాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్కూల్ కమిటీ చైర్మన్, సభ్యులు అభినందించారు.

పేకాటాడుతున్న 13మంది అరెస్ట్... రూ.18వేల నగదు స్వాధీనం

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని గాదెలవలస నుంచి జయంతిరాయిపురం వెళ్లే బట్టిగట్టుపై పేకాటాడుతున్న 13 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 18వేల 20 రూపాయల డబ్బును మరియు పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. తన సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

వైఎస్ఆర్సిపి ఉద్యోగులు, పెన్షనర్ల అనుబంధ విభాగం జిల్లా అధ్యక్షులు లిల్లీ పుష్పనాదం

విశాలాంధ్ర-పాలకొండ : ఉద్యోగుల సమస్యలు కూటమి ప్రభుత్వం త్వ ర్గా ప రి ష్క రిం చా ల ని వైఎస్ఆర్సిపి ఉద్యోగుల మరియు అనుబంధ విభాగం జిల్లా అధ్యక్షులు ఎద్దు లిల్లీ పుష్పనాదం,నియోజకవర్గ ఉద్యోగుల, పెన్షనర్లు విభాగం అధ్యక్షులు దుప్పాడ పాపినాయుడు అన్నారు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగుల సమస్యలు పట్ల పట్టించుకోవటం లేదన్నారు ఐ ఆర్ ఊసే లేదన్నారు డిఎలు ఇంతవరకు ప్రకటించలేదన్నారు ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదు అన్నారు. సచివాలయ ఉద్యోగులపై కూడా తీవ్ర పనిభారం పెంచు తున్నారన్నారు. వాలంటీర్ వ్యవస్థ ఎత్తివేసి ఆ పనిబరాన్ని సచివాలయ ఉద్యోగులకి అప్పగించటం జరిగిందన్నారు క్లస్టర్ బాధ్యతలు కూడా అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్ని స్తుందని ఇది సరికాదన్నారు. వాళ్ళు చేస్తున్న నిరసన కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

రాజకుమార్ ఉపాధ్యాయుడికి సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవరత్న నేషనల్ అవార్డు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : చేయూతసోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, దేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ యుఎస్ఏ /ఇండియా వారి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా దుంబ్రిగుడ మండలం సాగర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన జాకేరు రాజ కుమార్ ని ఆ సంస్థ ఎంపిక చేసింది. ఆయన విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్యను గుర్తించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురు పూజోత్సవం సెప్టెంబర్ 5 ఆయనకు విశాఖపట్నంలో ప్రశంస పత్రంతో పాటు ఘనంగా దుస్సాలువాతో సన్మానం చేశారు. గత 13 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ అనేకమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ అనేక అవార్డ్స్ తీసుకున్నారు. ఈ అవార్డును కె.అరుణ్ కుమార్ అడ్వకేట్-సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా, డాక్టర్ అమోస్ జేమ్స్ నేషన్ డైరెక్టర్,డాక్టర్ వై.ఎస్. చిన్నారావు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వారి ఆధ్వర్యంలో చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవరత్న నేషనల్ అవార్డు ఇవ్వడం జరిగిందని రాజ కుమార్ తెలిపారు.

నిత్యవసరాలు పంపిణీ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని చొక్కన పల్లి (కొత్తూరు), కల్లూనూరు గ్రామాలలో జై హనుమాన్ బోట్ ద్వారా గోదావరి మీదుగా వెళ్లి ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూరగాయలు నిత్యవసరాలు ఆదివారం పంపిణీ చేశారు. సుమారుగా 350 మందికి అందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓంకార్ చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎన్ బి ఎన్ బి భాలస్వామి, సిహెచ్ రాజేష్ సొసైటీ ప్రెసిడెంట్ గొంది చంద్రయ్య ఎంపీటీసీ వెంకటేష్ రెడ్డి, సర్పంచ్ పులి సంతోష్ రాము, ముత్యాల శ్రీను సోడే మల్లయ్య ఎస్.వెంకటేశ్వర్లు వై.ఆనంద్, శివ, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన అంగన్వాడీ యూనియన్ మండల కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-అనంతగిరి : గౌరవ అధ్యక్షులుగా పి.మంజుల, అధ్యక్షులుగా సిహెచ్ కళావతి, కార్యదర్శిగా సాగర సుమిత్ర ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అనంతగిరి మండల అంగన్వాడీ యూనియన్ మహసభ పీ మంజుల అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ కళావతి మాట్లాడుతూ గతంలో మనం 42 రోజులుగా సమ్మె చేసి అనేక సమస్యలు పరిష్కారం చేసుకొనమని తెలిపారు భవిష్యత్తులో మరిన్ని పోరాటానికి సిద్ధం కావాలని కోరారు కనిస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అనంతరం 21 మంది తో అనంతగిరి ప్రోజెక్టు నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు ఈకార్యక్రమంలో పార్వతి సుభలక్ష్మీ చిలకమ్మ సునిత సంఘిత సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కాఫీ బెర్రీబోరర్ తెగుళ్లపై జాగ్రతలు తీసుకోవాలి

గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు

విశాలాంధ్ర-జీకే వీధి : జీవన వృద్ధిలో కాఫీ తోటల పెంపకం చాలా ప్రాముఖ్యమైనవని, ఈ ఏడాది అధిక దిగుబడి అధిక కిట్టుబాటు ధరలతో రైతులకు ఎంతో మేలు జరిగిందని, అటివంటి కాఫీ తోటలపై బెర్రీ బోరర్ అనే వ్యాధి సోకడంతో రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాఫీ తోటలో పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేక శాస్త్రవేత్తల బృందాన్ని పంపించి కాఫీ బెర్రీ బోరర్ వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం కాఫీ రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సంకాడ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ బెర్రీ బోరర్ వ్యాధి సోగిన వండ్లను గుర్తించి వేడినీటిలో ఉడికించి భూమిలో పాతి పెట్టాలని, పురుగు వేరేచోటికి చేరకుండా కోరంటైన్ చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు, కాఫీ బోర్డు అధికారులు గ్రామాలలో సర్వే చేసి సలహాలు సూచనలు ఇస్తున్నారని వాటిని కాఫీ రైతులు ఆ పద్ధతులను పాటించిలన్నారు. కాఫీ పంట దిగుబడిని పెంచుకొని ఆర్థిక అభివృద్ధిని పొందాలని సంకాడ తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు కోరారు.

వెలుగు విఓఏ(యానిమేటర్)ల నూతన యూనియన్ ఎన్నిక

విశాలాంధ్ర-జిమాడుగుల : మండల విఓఏల యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఈ సందర్భంగా మండల సీఐటీయూ కో- కన్వీనర్ వెలుగు విఓఏల సంఘం గౌరవ అధ్యక్షులు వి మహేష్ మాట్లాడుతూ విఓఏల యూనియన్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి విఓఏ సమస్యలపై చర్చించిన అనంతరం నూతన యూనియన్ ఏర్పాటు చెయ్యడం జరిగింది,జి మాడుగుల మండల వెలుగు విఓఏల ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా అండంగిసింగి(విఓఏ) ఎస్.మత్యలింగం ఈయన గతంలో యూనియన్ సలహా దారునిగ పనిచేసారు, కార్యదర్శిగా కె దేవినాయుడు, సహాయ కార్యదర్శిగా ఎన్, లక్ష్మన్ కోశాధికారిగా జి, సింహచలం అలాగే ధర్మ, బాలన్న, కాశీ, పుష్ప, ధర్మ, దావీద్, పద్మ, 7 గురు మంది క్లస్టర్ బాధ్యులు, యూనియన్ సలహా దారులుగా రావణ మూర్తి యూనియన్ ఆడిటర్స్ సర, సుధ, రత్న ఏకగ్రీవంగా ఏనుకోవడం జరిగింది... ఈ కార్యక్రమంలో మండల విఓఏలు పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న గొట్టేలపాడు వాగు

12 గ్రామాల రాకపోకలకు అంతరాయం

విశాలాంధ్ర-కొయ్యూరు : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొయ్యూరు మండలంలోని కొండవాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఇదే మండలం శివారు నున్న యూ. చిడిపాలెం పంచాయితీ శివారు గొట్టేలపాడు కొండవాగు రహదారి పైనుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న గెడ్డ ఉధృతికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఈ పంచాయితీ పరిధిలో ఉన్న గొ ట్టేలపాడు కాలువ దాటి యూ. చిడిపాలెం, ఎర్రకొండ, మర్రిపాకలు, జెర్రిగొంది, తీగలమెట్ట తదితర 12గ్రామాలు వెళ్ళే గిరిజనులకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే గెడ్డ దాటి గెడ్డకు ఎడమ పక్కన మరో 20 గ్రామాలు వెళ్లాలన్న ఈ గెడ్డ పొంగితే మరో మార్గం లేని పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్. ఎమ్మెల్యే, ఎం పి లు తమ కష్టాలను చూసి అయినా ఈ గెడ్డ పై పక్కా వంతెన నిర్మించి ఆదుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెదవలసలో 40 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్ట్, ద్విచక్ర వాహనం సీజ్

విశాలాంధ్ర-జీకే వీధి : జీకే వీధి మండలం పెదవలస గ్రామం లో వాహనాలు తనిఖీ చేస్తుండగా. నాతవరం గ్రామానికి చెందిన మేకల అప్పారావు (42), మల్లవరపు అఖిల్ (21) ద్విచక్ర వాహనం ద్వారా 40 కేజీల గంజాయి రవాణా చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారని జీకే విధి కె.సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జికె వీధి ఎస్ ఐ సురేష్, జీకే విధి వీఆర్వో, జీకే వీధి పోలీస్ పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా మాజీ ఎంపీ జి.మాధవి నియామకం

విశాలాంధ్ర-కొయ్యూరు : వైసిపి పార్టీ సీనియర్ నాయకురాలు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ మాజీ సభ్యులు గొడ్డేటి మాధవి ను శ్రుంగవరపుకోట, యలమంచిలి నియోజకవర్గాలకు వైయస్ అర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వైసిపి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహనరెడ్డి నియమించినట్టు తెలిపారు. ఈ మేరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్రెడ్డి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మాజీ ఎంపి జి.మాధవి తెలిపారు. పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్రెడ్డి తనకు కల్పించిన ఈ అవకాశం పట్ల ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన శృంగవరపుకోట, యలమంచలి నియోజక వర్గాలలో వైసిపి పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తానని ఆమె అన్నారు.

మన్య ప్రాంతాభివృద్ధి వైకాపా వల్లే సాధ్యం

- కూటమి నాయకుల ఆరోపణలు అవాస్తవం
- దుష్ప్రచారం మానుకోవాలని తెదేపా నాయకులకు హితవు పలికిన

వైకాపా మండల అధ్యక్షుడు గణబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతాభివృద్ధి వైకాపా వల్లే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాంగి గణబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు పూర్తి అయినప్పటికీ ఇన్నేళ్లపాటు ఎన్నో పార్టీలు, ప్రభుత్వాలు పరిపాలించినప్పటికీ మునుపెన్నడు కని విని ఎరుగని రీతిలో వైకాపా ఐదేళ్ల పాలన ప్రజా పరిపాలనగా సాగిందన్నారు. మన్య ప్రాంతంలో వైకాపా హ్యాట్రిక్ విజయాలు సొంతం చేసుకుని రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి మన్య ప్రాంతంలో చోటు లేకుండా ఈ ప్రాంత ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి గడపకు సంక్షేమ పథకాన్ని అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డి దన్నారు. వైకాపా పాలనలో తీసుకున్న అనేక నిర్ణయాల వలన మన్య ప్రాంతం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. చింతపల్లి లో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వైకాపా హయాంలో మంజూరు చేసిందేనని, అదే క్రమంలో అంజలి శనివారం ప్రధాన రహదారి నిర్మాణం కూడా వైకాపా హయాంలోనే మంజూరయిందన్నారు. నిర్మాణ పనులలో జాప్యం వలన ఆ పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి పూర్తి అయ్యే తప్ప ఆ నిర్మాణం విషయంలో కూటమి ప్రభుత్వం పాత్ర గానీ, కూటమి పార్టీలకు చెందిన నాయకుల యొక్క ప్రమేయం గాని ఎక్కడా లేదన్నారు. రహదారి నిర్మాణం పూర్తి అయిన తరువాత ఆ రహదారి నిర్మాణం పూర్తి చేసిన ఘనత తమదే అని కూటమి పార్టీలకు చెందిన నాయకులు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారమే లక్ష్యంగా అజెండాను పక్కనపెట్టి మూడు జెండాలతో (తెదేపా, జనసేన, బిజెపి) జత కట్టిన తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాలు అంటూ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి లోని తెదేపా ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లు పెంచామంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం మరోవక్క వికలాంగులు, దివ్యాంగుల పెన్షన్‌లను తొలగించేందుకు ప్రయత్నాలు చేయడం ఈ ప్రభుత్వానికి వికలాంగులు, దివ్యాంగులపై ఉన్న సవతి ప్రేమకు నిదర్శనం అన్నారు. ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలెండర్‌లు అని చెప్పిన తెదేపా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినప్పటికీ ఒక్క గ్యాస్ సిలిండర్‌కి డబ్బులు పడ్డాయన్న విషయం తెదేపా సహా ప్రతి వంట గ్యాస్ వినియోగ దారుని వద్ద నుంచి వినిపిస్తున్న మాట అన్నారు.ఇదే విధంగా మిగిలిన నాలుగు పథకాలను కూడా ఏడాది పాటు కాలయాపన చేసి అరకొరగా అందిస్తున్నారు తప్ప అభివృద్ధి అనేది ఎక్కడా లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వాలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ఉద్యోగ విప్లవం తీసుకు వచ్చామన్నారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి 50 కుటుంబాలకు ఒకరు చొప్పున గ్రామ వాలంటీర్ లను, శాశ్వత ప్రాతిపదికన 1.36 లక్షల మంది సచివాలయ ఉద్యోగులను నియమించిన ఘనత వై యస్ జగన్మోహన్ రెడ్డి దన్నారు. ఆడిన మాట, చేసిన వాగ్దానం, మాట తప్పని మడమ తిప్పని నైజం జగన్మోహన్ రెడ్డి దన్నారు. నాడు నేడు పథకం ద్వారా విద్యాలయ భవనాలకు నూతన రూపం తీసుకురావడమే గాక, ప్రతి పంచాయతీలో సచివాలయ, రైతు భరోసా, వెల్నెస్ భవనాల నిర్మాణాలకు వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిన వైకాపా పై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. అంజలి శనివారం రహదారి నిర్మాణం పూర్తి చేసిన ఘనత తమదని తెదేపా నాయకులు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమన్నారు.

మరిపివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం ఓలేటి తవిటి నాయుడు, స్కూల్ అసిస్టెంట్ కలిపిండి రమేష్ లకు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకోవడంతో అవార్డులను పొందిన వారిద్దరిని హెచ్ ఎం జి. విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సురేష్, రాజు లక్ష్మి నారాయణ, ప్రసాదరావు ఉమా , వెంకట లక్ష్మి మాలతి, శంకరావ్, చిన్నంనాయుడు, ఎస్సీ బాలికల వసతిగృహం వార్డెన్ గౌరీశ్వరి, మరియు గ్రామపెద్దలు, విద్యార్థిని విద్యార్థులు సత్కరించి అభినందించారు.

యుటిఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-సీతానగరం : ఆర్థిక విద్యారంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ నిర్వహించే రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ పిలుపునిచ్చింది. ప్రస్తుతం పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రశాంతంగా పాఠాలు చెప్పే వాతావరణం లేదని దీనికి కారణం ప్రభుత్వం అనుసరించే విధానాలేనని ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళి మోహన్ రావు విమర్శించారు. తక్షణమే ఉపాధ్యాయులకు బోధ నేతల పనుల నుండి విముక్తి కలిగించాలని ఒత్తిడి లేకుండా పాఠశాలలో పనిచేసే వాతావరణం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని తక్షణమే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసమావేశంలో యుటిఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి కె భాస్కరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం నుండి ఆర్థిక బకాయిలు పేరుకు పోయాయని వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పెండింగ్ ఉన్న డి ఏ లను విడుదల చేయాలని 12వ పిఆర్సి కమిషనర్ను వెంటనే నియమించాలని కోరారు.సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 15 నుండి 19వరకు రాష్ట్రాన్ని ఐదు ప్రాంతాలుగా తీసుకొని రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు.

ఈకార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల్లో చైతన్యాన్ని కలిగించి ప్రభుత్వంపై ఒత్తిడి చేసి సమస్యలు పరిష్కరింపజేయాలని ఆశిస్తున్నామని, అప్పటికి ప్రభుత్వం స్పందించిన పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని యుటిఎఫ్ కౌన్సిల్ తెలిపింది.యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమావేశాల్లో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ భాస్కరరావు,జిల్లా కోశాధికారి కే మురళి, జిల్లా కార్యదర్శులు ఎం పైడిరాజు ఎన్ శ్రీనివాసరావు కే కృష్ణారావు బికోర్మారావ్ ఎం శంకర్రావు బి రామకృష్ణ ఎన్ శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పే మధుసూదన్ రావు , జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి వెంకట నాయుడు మరియు అన్ని మండలాల యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు బీభత్సం... ప్రజలకు ప్రమాదం

విశాలాంధ్ర-బెలగాం : పట్టణంలో నున్న బైపాస్ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం చేస్తున్నారు. ఇటీవల ఈ గుంతల్లో బైక్ స్లిప్ కావడంతో పలువురు ప్రమాదాలకు గురై కాలు సంఘటనలు చోటు చేసుకున్నాయి."రోడ్డు దుస్థితి గురించి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కూటమి నాయకులు, అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని"ప్రజలు మండిపడుతున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ రోడ్డు ఇప్పుడు వాహనదారులకే ప్రమాదకారకంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరింత మంది గాయాలు పాలుకాకుండా ఎవ్వరూ మృత్యువాత పడకుండా ఇప్పటికైనా అధికారులు కళ్ళుతెరచి చర్యలు చేపట్టి బైపాస్ రోడ్డును బాగుచేయించాలని కోరుతున్నారు. బైపాస్ రోడ్డును బాగుచేయించండి.

- సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు, ఎఐటీయుసి జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్

బైపాస్ రోడ్డు పూర్తిగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు తమ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కూటమి ప్రభుత్వం వచ్చినా పార్వతీపురం మన్యం జిల్లా రోడ్ల పరిస్థితి మారలేదని విమర్శించారు. ఆ గుంతల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాల్సి ఉందని కనీసం ఆ దిశగానైనా అధికారులు స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా బైపాస్ రోడ్డును బాగు చేయించాలని లేకుంటే ప్రజాసంఘాలతో కలసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం పార్వతీపురం సబ్ డివిజన్ ఎఎస్పీ అంకిత సురాన ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్స్ పోలీస్ అధికారులు, సిబ్బంది బెలగాం, చాకలి బెలగాంలో గల పలు హాస్టళ్లను, చర్చి వీధిలో గల వేదాంత జూనియర్ కళాశాలను ఆదివారం సందర్శించి విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఈగిల్ మరియు బాల్య వివాహాలు, డయల్ 112 సేవలపై అవగాహన కల్పించారు. జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి శక్తి టీం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందని తెలియచేస్తూ ప్రతి ఒక్క విద్యార్థిని తన యొక్క మొబైల్ ఫోన్లో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని అందులో ఉండే 11 ఫ్యూచర్స్‌పై అవగాహన చేసుకుని ఆపద సమయంలో శక్తి యాప్ ఎలా వినియోగించుకోవాలో తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో పార్వతీపురం శక్తి టీం ఇంచార్జ్ ఎఎస్ఐ లెంక శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ యు. గురుమూర్తి, మహిళా కానిస్టేబుళ్లు నిర్మల, పద్మ, శక్తి టీం 1&2 సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణంతో అవస్థలు

ఆంధ్ర కశ్మీర్ లంబసింగి బాలికల ఆశ్రమ వసతి గృహ భవన నిర్మాణానికి మోక్షమెప్పుడు

విశాలాంధ్ర-చింతపల్లి : ఆంధ్ర కశ్మీర్ లంబసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహంలో గడచిన పదేళ్లుగా భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న లంబసింగి ప్రాంతంలో విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఉన్న భవనాలను తొలగించి నూతన భవనాల నిర్మాణాలకు పిల్లర్స్ వేశారు. నాటి నుంచి నేటికీ ఆ భవన నిర్మాణం పిల్లర్స్ స్థాయిలోనే అసంపూర్తిగా ఉండడంతో అక్కడ విద్యను అభ్యసించే విద్యార్థినులు విద్యనభ్యసించేందుకు, నిద్రించేందుకు సరిపడ వసతులు లేకపోవడంతో అటు విద్యార్థినిలు ఇటు ఉపాధ్యాయులు సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. నాడు తెదేపా ప్రభుత్వంలోనే మంజూరైన ఈ వసతిగృహ భవన నిర్మాణాన్ని నేడు తెదేపా ప్రభుత్వంలోనైనా పూర్తి చేసి పుణ్యం కట్టుకోవాలని విద్యార్థినిలు, ఉపాధ్యాయునిలు కోరుతున్నారు.

అందుబాటులోనే యూరియా

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : మండలంలో ప్రస్తుతానికి కావలిసిన యూరియా అందుబాటులోనే ఉందనీ రైతు లెవరు ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయ అధికారి చక్రధర్ తెలియజేశారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఇండెంట్‌లు సిద్ధం చేస్తున్నామని ప్రస్తుతం మండలంలో 30 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదని తెలియచేసారు. సిఫారసు మేర మాత్రమే ఎరువులు వేసుకోవాలని తెలియచేశారు. ఎరువులు ఎక్కువగా వెయ్యడం వల్ల నేల సారవంతం కోల్పోవడం తో పాటు నాణ్యత లేని ఉత్పత్తులు వస్తున్నయని ఆ ఆహార ఉత్పత్తులు తినడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని తెలియచేసారు,ప్రదాన పంట అయిన వరికి పంట మొత్తానికి గాను 75 కిలోల యూరియా సరిపోతుందని, నాట్లు వేసుకోనే సమయంలో 25కేజీలు, 30-35 రోజులా తరువత 25 కిలోలు 60 రోజులకి 25కేజీల చొప్పున వేసుకోవాలని తెలియచేసారు. జడ్డంగిలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ మురళి మాట్లాడుతూ రైతులందరూ తప్పకుండ పంట నమోదు చెయ్యించుకోవాలి అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, జడ్డంగి ఎస్సై చినబాబు, మాజీ పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణ, వీఏఏ శ్రీను, రైతులు పోల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు డిమాండ్

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ పోతురాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సంవత్సరాలు తరబడి విధులు నిర్వహిస్తున్న నెలకు 3000 జీతలు ఇవ్వడం తీవ్ర అన్యాయమని చెప్పారు. బయట కూలి పనులకు పోతే ఒక్కరోజు 300 రూపాయలు ఆదాయం వస్తుందని చెప్పారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు ఒకరోజు 100 రూపాయలు మాత్రమే వేతనం ఇస్తుందని, ఇచ్చే అతి తక్కువ వేతనాలు కూడా నెలలు తరబడి ఉంటుందని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులకు వంట చేయుటకు బియ్యం, గుడ్లు, రాగి పిండి మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన కారం, పసుపు, ఉప్పు, నూనె,పప్పు, పచ్చి కూరగాయలు మధ్యాహ్న కార్మికులు సొంత డబ్బులతోనే కొనుగోలు చేసి చిన్నారులకు అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఐదు రూపాయలు 85 పైసలు ఇస్తున్నారని అది ఏమాత్రం కూడా సరిపోదని తక్షణమే ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థికి పది రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్, కర్రలు డబ్బులు కూడా ప్రభుత్వం చెల్లించటం

లేదన్నారు. ఈవిషయంపై ప్రభుత్వం జోక్యం చేసుకొని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని,కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెల వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ఇబ్బందు లేకుండా యూరియా పంపిణీ

ఎఎంసీ చైర్మన్ గొట్టాపు గౌరి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు యూరియా పంపిణీ సజావుగా, సక్రమంగా జరుగుతుందని ఎఎంసీ చైర్మన్ గొట్టాపు గౌరీ వెల్లడించారు. మండలంలోని నర్సిపురం సచివాలయానికి వచ్చిన యూరియా బస్తాలను రైతులకు సక్రమంగా అందించారు. శని, ఆదివారం రెండు రోజులు పాటు సజావుగా ఈ పంపిణీ ఎఎంసీ చైర్మన్ గొట్టపు గౌరీ, తెదేపా సీనియర్ నాయకులు రమణ పర్యవేక్షణలో నిర్వహించారు. రైతుకు సంబంధించి ఆధార్ కార్డు, భూమి యొక్క పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున యూరియాను అందించారు. ప్రస్తుతం యూరియా కొరత ఎక్కడా లేదని డిమాండ్ అధికంగా ఉన్న మాట వాస్తవమేనని అన్నారు. కొంత సమయం పట్టినప్పటికీ రైతులకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం సిద్ధం చేస్తుందని, రైతులు కూడా ఈ విషయాన్ని గమనించి సమన్వయం పాటించి ఎరువులను సక్రమంగా ఉపయోగించు కోవాలని సూచించారు. ఈ పంపిణీలో రైతులతో పాటు, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

గిరి గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సౌకర్యం కల్పించాలి - సర్పంచ్ విజ్ఞప్తి

విశాలాంధ్ర-అరకులోయ : అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ నియోజక వర్గం డుంబ్రిగూడ మండలం కితలంగి పంచాయతీ పరిధిలో పాడి, కితలంగి,కొంత్గూడ గ్రామాలలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ కల్పించాలని కితలంకి పంచాయతీ సర్పంచ్ వరబోయిన సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆంధ్రప్రభతో మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మించినప్పటికీ బిఎస్ఎన్ఎల్‌డబ్ల్యూ సెల్ సిగ్నల్ సౌకర్యం లేక పాడి, కితలంగి, కొంత్గూడ గ్రామల ప్రజలు అనేక ఆగచాట్లు పడుతున్నారని ఆయన వాపోయారు.నేటి సాంకేతిక విప్లవంలో ప్రతి గ్రామంలో సెల్ సిగ్నల్ అందుబాటులో ఉండగా పాడి, కితలంగి, కొంతగూడ గ్రామాలలో మాత్రం సెల్ సిగ్నల్ లేక కించమండ, డుంబ్రిగూడ గ్రామాలకు వెళ్లి పనులు చేసుకోవలసిన పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన గ్రామాలలో కూడా ఇంతవరకు సెల్ సిగ్నల్స్ సౌకర్యం లేకపోవడం తీవ్ర విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సెల్ సిగ్నల్ సౌకర్యం కల్పించాలని గతంలో మండల జిల్లా అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన ఫలితం లేకపోయిందని ఆయన వాపోయారు. సెల్ సిగ్నల్ సౌకర్యం లేకపోవడంతో అత్యవసర ప్రభుత్వ పనుల కోసం ఇతర సౌకర్యాల కోసం సిగ్నల్ ఉన్న గ్రామాలకు వెళ్ళవలసి వస్తుందని దీనికోసం వందలాది రూపాయల ఖర్చుపెట్టి ఆటోలను ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదని ఆయన ఆవేదన చెందారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు, బిఎస్ఎన్ఎల్ ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే పాడి,కితలంగి,కొంత్గూడ గ్రామాలకు సెల్ సిగ్నల్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సెల్ సిగ్నల్ సౌకర్యం కల్పించనీ పక్షంలో అలంకారప్రాయం ఏర్పాటుచేసిన సెల్ టవర్లను తక్షణమే ఎత్తివేయాలని ఆ ప్రాంతాల నుండి వాటిని తొలగించాలని ఆదివాసి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రహదారిపైనే భారీ వాహనాలు... పట్టించుకోవాలని అధికారులకు విజ్ఞప్తి



విశాలాంధ్ర-అరకులోయ : ప్రముఖ పర్యటక కేంద్రమైన ఆంధ్ర ఊటీ అందాల అరకులోయ పట్టణంలోని ప్రధాన రహదారిలో భారీ వాహనాలు రహదారిపైనే నిలుపుదల చేయడంతో వాహన చోదకులు అనేక అగచాట్లు పడుతున్నారు. ప్రధానంగా సుర్జో గోడౌన్, చిన్ని వైన్స్ రహదారి జంక్షన్,సి.కాలనీ సాయిబాబా గుడి రహదారిలో ఎస్. కోట,ధర్మవరం,ఎల్ కోట,విజయనగరం చెందిన భారీ వాహనాలు గంటల తరబడి నిలుపుదల చేసి వాహన చోదకులకు,పాదచారులకు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నారని కొండవీది,స్టేట్ బ్యాంక్ వీధి, ప్రధాన రహదారిలో వాహన చోధకులు,పాదచారులు గగ్గోలు పెడుతున్నారు.సంబంధిత అధికారులు పట్టించుకోవాలని ఆయా వీధుల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రధానంగా అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలన్న,పరీక్ష రాసేందుకు కేంద్రాలకు తరలి వెళ్లాలన్న ఈ భారీ వాహనాలు రహదారికి అడ్డంగా ఉండడం వలన సకాలంలో ఆసుపత్రికి వెళ్లలేక పరీక్ష కేంద్రాలకు చేరుకోలేక అనేక అగచాట్లు పడవలసి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.ప్రజలకు ఇబ్బందులు గురి చేసే విధంగా ప్రతిరోజు భారీ వాహనాలు సుర్జో, చిన్ని వైన్స్, సి.కాలనీ సాయిబాబా జంక్షన్లో, ప్రధాన జంక్షన్లో నిలిచిపోతున్న అధికారులు ఎందుకు పట్టించుకోకుండా మౌనంగా ఉండి పోతున్నారని ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి అరకులోయ పట్టణంలోని చిన్ని వైన్స్,సుర్జో పాత్రో జంక్షన్, సీ.కాలనీ సాయిబాబా గుడి జంక్షన్లో భారీ వాహనాలు నిలుపుదల లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని,ప్రజలకు ఎటువంటి అసౌకర్యం గురి కాకుండా చూడాలని ఇష్టారాజంగా నడిరోడ్డుపై వాహనాలు నిలుపుదల చేస్తున్న భారీ వాహనాల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్టేట్ బ్యాంక్ వీధి,సి.కాలనీ, కొండవీది, చేపల వీధి ప్రజలు కోరుతున్నారు.

8న ఐదు కిలోమీటర్ల రెడ్ రన్ మారథాన్

విశాలాంధ్ర-పార్వతీపురం : రేపు మంగళవారం పార్వతీపురం మన్యంజిల్లా కేంద్రంలో ఐదుకిలోమీటర్ల రెడ్ రన్ మారథాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబి ఆఫీసర్ డాక్టర్ మంతిని వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీకళాశాలనుంచి రెడ్ రన్ మారథాన్ కార్యక్రమం ప్రారంభం జరిగి జిల్లా కలెక్టర్ కార్యాలయం మెయిన్ గేట్ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హెచ్ ఐ వి , ఎయిడ్స్ పై అవగాహన కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఉదయం ఐదున్నర గంటలకు శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రారంభము కానున్న ఈ రన్ మారథాన్ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనీ విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రథమస్థానం సాధించిన వారికి పదివేల రూపాయలు నగదు బహుమతి, ద్వితీయస్థానం సాధించిన వారికి ఏడువేల రూపాయలు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే యువత 9494474206కు ఫోన్‌చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇదిలాఉండగా మంగళవారం నాడు జరిగే 5 కిలోమీటర్ల మారథాన్ రన్ కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు.

అంతు చిక్కని రోగంతో మంచానపడ్డ గ్రామాలు

అక్కరకు రాని వైద్యం... నొప్పి మందులే శరణ్యం

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : మండలం లాగరాయి పిహెచ్సి పరిధిలో, లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాలలో ప్రజలు గత మూడు నెలలుగా అంతు చిక్కని రోగంతో మంచాన పడుతున్నారు, ముందుగా జ్వరం రావడం

తరువాత విపరీత మోకాళ్ళ వాపులు, కీళ్ల నెప్పులతో ప్రజలు మంచాన పడుతున్నారు. అయితే ప్రభుత్య హాస్పటల్‌కి వెళ్లి వైద్యం చేయించుకున్న ఎటువంటి ఫలితం ఉండటం

లేదని,ప్రయిచేటు హాస్పిటల్స్‌ని ఆశ్రయిస్తున్నామని తెలిపారు. మూడు పూటలా నొప్పుల మాత్రలు మింగితేనే కొంచెం ఉపశమనం ఉంటుందని తెలిపారు,ప్రతి ఇంటికి ఇద్దరు, ముగ్గురు ఈవ్యాధితో బాధపడుతుండంతో, కాల కృత్యాలు తీర్చుకోవడానికి, ఇంటి పనులకు చాలా ఇబ్బందులు పడుతున్నామని బాధితులు తెలుపుతున్నారు. ఈ వ్యాధి రెండు నెలల పసికందు నుండి పండు ముసలి వరకు ఎవ్వరిని పదలక పోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.